శృంగేరి శారద శంకరమఠంలో హోమం

మోతీనగర్: శృంగేరి జగద్గురు విజయశేఖర భారతి స్వామి 33వ వర్ధంతి సందర్భంగా మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శృంగేరి శారద శంకరమఠంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువందనం, గురు పాదుకపూజా, రుద్ర ఆయుష్ హోమం, వేద పారాయణం నిర్వహించారు. శృంగేరి జగద్గురు మోతీనగర్ కార్య నిర్వాహణాధికారి సీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి ఆశ్రమం ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నో మఠాలు నిర్మించి ఆధ్యాత్మిక సామజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మోతీనగర్ శాఖ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఓఎస్ఏటీ నిర్మించిన తరగతి గదులు ప్రారంభం



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ పరిధి బహదూర్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో వన్ స్కూల్ ఎట్ ఏ టైమ్ లింక్ (ఓఎస్ఏటీ) సంస్థ సహకారంతో నిర్మించిన ఐదు తరగతి గదులను మంగళవారం అందుబాటులోకి తెచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యా శాఖ కార్యాలయం అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్‌రాజుతో కలిసి ఓఎస్ఏటీ ప్రతినిధి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి అయ్యన్న, పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, స్థానికులు పాల్గొన్నారు

వైభవంగా బోనాలు



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో శ్రావణ మాస బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ వేణు, వలి, యాదగిరి, సాజిద్, ఖయ్యూం, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



వైష్ణవి ఎన్‌క్లేవ్ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ..



చిత్తరమ్మ ఆలయం వద్ద



చిత్తారమ్మ దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కుత్బుల్లాపూర్: నాగుల పంచమిని పురస్కరించుకుని పలు దేవాలయాల వద్ద ఉన్న పుట్టకు పాలు పోసి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా వచ్చిన ఈ నాగుల పంచమి సందర్భంగా దేవాలయాలు కిటకిటలాడాయి. గాజులరామారం చిత్తరమ్మ ఆలయం వద్ద బారులు తీరి పుట్టకు పాలు పోశారు. అదేవిధంగా హెచ్‌ఎంటీ కాలనీ, వైష్ణవి ఎన్‌క్లేవ్ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద, బాలాజీ లేఅవుట్ లతోపాటు పలు ప్రాంతాలలో పుట్టల వద్ద పూజలు చేశారు.



చిత్తారమ్మ ఆలయం వద్ద పూజలో..



కేవీఎస్ ఫంక్షన్‌హాల్ ముందు ఉన్న పుట్ట వద్ద



బీరప్పనగర్‌లో నాగదేవత ఆలయంలో ..

ఘనంగా అమ్మవారి కల్యాణోత్సవం

పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లోని నాగదేవత ఆలయంలో మంగళవారం అమ్మవారి 13వ కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 11.22 గంటలకు ఉత్తర నక్షత్ర లఘ్నమున నిర్వహించిన కల్యాణానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగదేవత కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలన్నారు. కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందనం దివాకర్, బీఆర్ఎస్ నాయకులు శంకరయ్య, ఉదయ్ గంజి, ఖాదర్, ఆలయ కమిటీ సభ్యులు అమరేందర్ చారి, సురేష్, భారతి, వరలక్ష్మి, శ్రీకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్

మురుగు నీటిని అరికట్టాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

దుండిగల్: మురుగు నీటి సమస్యతో ప్రతి నిత్యం ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మల్లంపేట ప్రాంత వాసులు వాపోతున్నారు. మురుగు నీటి సమస్యను అరికట్టాలని మంగళవారం మల్లంపేటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు మాట్లాడుతూ.. వివిధ కాలనీల నుంచి వస్తున్న మురుగు నీరు రామచంద్రయ్య కాలనీలో చేరుతుందని, చెరువులు సైతం పూర్తిగా కలుషితమవుతుందన్నారు. రామచంద్రయ్య కాలనీ పూర్తిగా మురుగు నీటితో నిండిపోయిందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా బోర్లు వేస్తే కూడా రంగు నీళ్లు వస్తున్నాయని, వర్షాకాలంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

అందరూ అంగీకరిస్తే 'డబుల్' నిర్మాణం

దుండిగల్: ఒకే దగ్గర ఇరుకుగా నివపిస్తున్న కుటుంబాలకు గుర్తించి ఆయా ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర నాయక్, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్ మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న స్లమ్‌లోని గుడిసెలు, మట్టి గోడలు, ఇతర ఇళ్లల్లో ఉన్న వారిని గుర్తించి, ఒకటే దగ్గర నివసించే కుటుంబాలు 400 గజాలు పైన ఉన్న వారి స్థలాలను గుర్తించారు. వారికి ఇష్టమైతే, వారి వద్ద నుంచి రాతపూర్వకంగా అగ్రిమెంట్ తీసుకొని డబుల్ బెడ్ రూమ్ నిర్మించి ఇవ్వడానికి వెరిఫికేషన్ చేశారు. బహదూర్‌పల్లి తండా, దొమ్మర పోచంపల్లి సాయి పూజ కాలనీ సర్వే నంబర్ 120, గాగిలాపూర్ సర్వే నంబర్ 214 ప్రాంతాలను సర్వే చేశారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జైలు శిక్ష.. జరిమానా

కుత్బుల్లాపూర్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి అత్వేల్లి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. సుచిత్ర చౌరస్తా, దూలపల్లి, కొంపల్లి ప్రాంతాల్లో అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ సోమ్లానాయక్, అమర్‌నాథ్, మల్లేశ్, షేక్ వలీలు పట్టుబడ్డారు. కోర్టులో ప్రవేశపెట్టగా రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

దుండిగల్: ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని బంగారు మైసమ్మ దేవస్థాన నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఆయనను కలిశారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సర్గారి రంగారెడ్డి, అధ్యక్షులు మిద్దెల యాదిరెడ్డి, ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, మిద్దెల బాల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మురళీ యాదవ్, ధర్మారెడ్డి, కార్యదర్శులు హన్మంత్ రెడ్డి, బైండ్ల గోపాల్, చింతకింది సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నర్సారెడ్డి భూపతిరెడ్డిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలకు ఎన్‌బీఏ టైర్ వన్ అక్రిడిటేషన్

దుండిగల్: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ వన్ అక్రిడిటేషన్ లభించింది. మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాలకు అక్రిడిటేషన్ రావడంతో మంగళవారం కళాశాల ఆవరణలో డైరెక్టర్లు డాక్టర్ పి.శ్రీధర్, అనుశ్రియారెడ్డి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి ఎన్నో విజయాలను అందుకుంటూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎన్‌బీఏ అక్రిడిటేషన్ రావడంలో కళాశాల అధ్యాపక బృందం తోడ్పాటు ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భర్తను చంపేందుకు భార్య కుట్ర

ఆరుగురి రిమాండ్

దుండిగల్: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ఓ మహిళ పలువురితో సన్నిహితంగా మెలిగింది. విషయం తెలిసిన భర్త ఆమెను మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని భావించింది. స్నేహితులతో కలిసి అంతమొందించేందుకు పన్నాగం పన్నింది. హత్యాయత్నం విఫలం కావడంతో భార్యతోపాటు ఆమె స్నేహితులు కటకటాల పాలయ్యారు. సీఐ సతీశ్ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దగూడెం తండాకు చెందిన నానావత్ రాందాస్‌నాయక్‌కు 15 ఏళ్ల క్రితం జ్యోతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా రాందాస్, జ్యోతిల మధ్య మనస్పర్థలు వచ్చాయి. మూడేళ్లుగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. జ్యోతి నిజాంపేట రాజీవ్ గృహకల్పలో నివాసముంటూ ప్రగతినగర్‌లో జొన్న రొట్టెలను విక్రయిస్తోంది. నెలరోజుల క్రితం ఇరు కుటుంబాల పెద్దమనుషులు సర్దిచెప్పి రాజీ కుదిర్చారు. 20 రోజులుగా కలిసి ఉంటున్న భార్యాభర్తల మధ్య మరోసారి విభేదాలు తలెత్తాయి. భార్య తరచూ పలువురితో సన్నిహితంగా వ్యవహరిస్తున్న తీరు రాందాస్‌కు నచ్చక ఆమెను హెచ్చరించాడు. దీంతో జ్యోతి భర్త అడ్డు తొలగించేందుకు పన్నాగం పన్నింది. స్నేహితుడైన గోపి, బంధువైన హేమంత్‌లతో చర్చించింది. 26న జ్యోతి భర్తకు ఫోన్ చేసి తాను రొట్టెలు చేసే ప్రదేశానికి రావాలని చెప్పగా, అతను అక్కడకు వచ్చాడు. అక్కడే ఉన్న గోపి మద్యం తాగుదామని రాందాస్‌ను తన బైక్‌పై బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ లహరి పార్క్ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అదే సమయంలో గోపి తన స్నేహితులైన శ్రీకాంత్, కరీముద్దీన్, సుబోధ్‌లను ఫోన్ చేసి పిలిపించాడు. అందరు కలిసి మద్యం సేవించాక, ఐదుగురు కలిసి రాందాస్‌పై బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. రాందాస్ చని పోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యారు.

స్పృహలోకి రావడంతో విషయం వెలుగులోకి..

తీవ్రంగా గాయపడిన రాందాస్.. దాడి జరిగిన గంట తర్వాత స్పృహలోకి వచ్చాడు. నేరుగా నిజాంపేటలో ఉంటున్న తన సోదరుడి ఇంటికి వెళ్లి.. అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. భార్యే తనను అంతమొందించేందుకు కుట్ర పన్నిందని ఫిర్యాదు చేశాడు. పోలీసులు జ్యోతితోపాటు గోపి, హేమంత్, శ్రీకాంత్, కరీముద్దీన్, సుబోధ్‌లను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.